భాగం తాను రెక్కలమీద సంపాదించినదే. అందుకని మిగిలిన బాంధవ్యాలన్నీ ఆస్తిముందు స్వల్పంగా కనిపిస్తయి అతనికి.

పొలాన్ని ప్రాణప్రదంగా కాపాడతాడు. పొలం బాగా పండటానికి ఏపనైనా చేస్తే అనేకసార్లు తన ప్రాణాలను లెక్కచెయ్యకుండా అవతల వాళ్ళు వేయించిన అడ్డకట్టలను తీయించి, తన చేనుకి నీళ్ళు పెట్టుకున్నాడు జోగయ్య. ఎవళ్ళొస్తారో రండి అని దుడ్డుకర్ర బట్టుకొని చేను గట్టుమీద నుంచుంటే వూరు వూరంతా హడలెత్తిపోయేది. బాగా నెర్రెగొట్టిన తన చేను నీటిని గుటాగుటా తాగుతుంటే పసివానికి స్తన్యానిస్తూ పరవశత్వంతో కూర్చునే తల్లిలా నుంచునేవాడు. కొడుకులు పెరిగొచ్చిన తర్వాత "మేం వుండగా నీ కెందుకీ తాపత్రయం. కృష్ణా, రామా అనుకుంటూ కాలం గడుపు కోక" అంటున్నారు. వాళ్ళకేం తెలుసు పసిగాయిలు! ఈ తాపత్రయంవల్ల తనెంత సుఖపడుతున్నదీ వాళ్ళకు అదేం అనుభవం కాదు

నెలరోజుల క్రితం జోగయ్యమామ భార్యకు జబ్బుచేసి ప్రాణం మీదకు వచ్చింది. అప్పటికి పదిరోజులనుంచీ ఆమె ముక్కుతూ మూలుగుతూ వుండేగాని, జోగయ్యమామ అట్టే పట్టించుకోలేదు. ఆ విషయం ఇంట్లోవాళ్ళు ఎవళ్ళు కదిలించినా, "రోగాలు మనుష్యులకు రాక మానులకు వస్తాయా?" అంటూ వెళ్ళేవాడు. దమ్ముచేసే రోజులవి అతనికి తీరేదికాదు ఏదైనా జబ్బు అంత తొందరగా ముసుకొస్తుందనుకోలేదు. అతను "నువ్వింట్లోవుండు అమ్మని కనిపెట్టుకొని; నేను చేను తడిపించి వస్తాను" అనిపెద్దకొడుకన్నాదేగాని జోగయ్య మామ యింటిదగ్గరవుండిలేకపోయాడు. అసలే నీటికి ఎద్దడిగా వుంది. ఎవరుఅడ్డంవేస్తారో తనపెద్దకొడుకు బుద్ధిమంతుడే కాని పొట్టి అర్భకుడు అవలివాళ్ళు నోరుచేసుకుంటే వెనక్కుతగ్గుతాడు తీరా పొలం తడవకపోతే, తరువాత యేమనుకునేం లాభం? అందుకని వూళ్ళో వైద్యుడిచేత భార్యకు నాలుగు మాత్రలు యిప్పించి, కాసిని నీళ్ళు తాగించి "కళ్ళుమూసుకుపడుకో, కునుకు పడుతుంది" అని చెప్పి పొలంబయలుదేరాడు. వూరి చివర చింతచెట్టు దగ్గరికి వచ్చేసరికి కొడుకు

